సాక్షి కామారెడ్డి

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



గుడ్‌ఫ్రైడే..
జిల్లాలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- 11లో ▸



జొన్న కొనుగోలు కేంద్రాలు..
జిల్లాలోని వెల్గనూర్, హన్మాజీపేట్‌లలో శుక్రవారం జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.
- 11లో ▸

గరిష్టం/కనిష్టం
40.6 /22.9

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండతీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ శాతం తక్కువగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

కామారెడ్డి టౌన్‌: జిల్లాలోని బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించే పరీక్ష కోసం జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష సామగ్రిని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

లోకల్ వాహనాలకు టోల్ ట్యాక్స్ చెల్లించం

- భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద తిప్పాపూర్ గ్రామస్తుల నిరసన



భిక్కనూరు: భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద పదేళ్లుగా లోకల్ వాహనాలకు టోల్ ట్యాక్స్ వసూలు చేయడం లేదని, ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారని తిప్పాపూర్ గ్రామ రైతులు టోల్ ప్లాజా సిబ్బందిని ప్రశ్నించారు. శుక్రవారం భిక్కనూరు టోల్‌ప్లాజాను ముట్టడించి నిరసన తెలిపారు. టోల్‌ప్లాజా ఇన్‌చార్జి ప్రకాశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చినప్పటి నుంచి లోకల్ వాహనాలకు టోల్ వసూలు చేస్తున్నారని దీని వల్ల భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. టోల్ గేట్‌లను ఎత్తి అరగంట పాటు జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ట్యాక్స్ లేకుండానే పంపించారు. విషయం తెలుసుకున్న భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ రైతులు, టోల్ ప్లాజా ఇన్‌చార్జిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. గతంలో స్థానికులనుంచి టోల్ వసూలు చేయలేదని ప్లాజా ఇన్‌చార్జితో పేర్కొన్నారు. ఇలా రోజూ లోకల్ గ్రామాల వారితో గొడవలు పెట్టుకుంటే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందన్నారు. ఈ విషయాన్ని మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువెళ్తానని టోల్ ప్లాజా ఇన్‌చార్జి ప్రకాశ్ తెలిపారు.

21 నుంచి కిసాన్ మేళా

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో 'కిసాన్ మేళా' నిర్వహించనున్నట్లు వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తెలిపారు. మేళాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభిస్తారని, మూడు రోజులపాటు జరిగే ఈ మేళాలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు, వారి ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచనున్నట్లు వివరించారు.

వడ్లు కొనేదెప్పుడో?



ఒడ్డేపల్లిలో ధాన్యం కుప్పలు

- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సర్కారు
- తూకాల ప్రారంభంలో జాప్యం
- పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు
- మూడు వారాలుగా ధాన్యం రాసుల వద్దే అన్నదాతల మకాం
- ఇబ్బంది పడుతున్న రైతులు

జిల్లావ్యాప్తంగా యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే చాలాచోట్ల ఇప్పటికీ తూకాలను మాత్రం మొదలుపెట్టలేదు. దీంతో రైతులు తరలించిన ధాన్యం రాశులు కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోతున్నాయి. మరోవైపు కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నిజాంసాగర్/లింగంపేట: జిల్లాలో యాసంగి వరి కోతలు ప్రారంభించిన రైతులు నూర్పిడి అనంతరం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. తూకాలు ప్రారంభం కాకపోవడంతో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలలో ధాన్యపు రాశులు పేరుకుపోయాయి. కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు అక్కడే రాత్రింబవళ్లు ఉండాల్సి వస్తోంది. కేంద్రాల వద్ద అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

బీహార్‌నుంచి వస్తేనే..

హమాలీల కొరతతోనూ తూకాలు ప్రారంభం కావడం లేదని తెలుస్తోంది. స్థానిక హమాలీలు అందుబాటులో ఉన్నచోట కాంటాలు ప్రారంభించారు. లేనిచోట బిహార్ నుంచి వచ్చేవారికోసం నిరీక్షిస్తున్నారు. దీంతో బిహార్ హమాలీలు వస్తే తప్ప కాంటాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు.



లింగంపేటలో పేరుకుపోయిన ధాన్యం

ప్రారంభం కాని కాంటాలు..

జిల్లాలో 446 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో సొసైటీల పరిధిలో 263, డీఆర్‌డీవో పరిధిలో 183 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించినా బాన్సువాడ డివిజన్ మినహా మిగతా ప్రాంతాలలో తూకాలు మాత్రం మొదలు పెట్టలేదు. లింగంపేట మండలంలో వరి నూర్పిళ్లు గతనెల 20వ తేదీన ప్రారంభించారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన రైతులు.. తూకాలు ఎప్పుడు మొదలు పెడతారోనని ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని పేర్కొంటున్నారు. నీడ సౌకర్యం కూడా లేదని, దీంతో చెట్ల కింద సేదతీరుతున్నామని అంటున్నారు. లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో రాత్రి వేళ ధాన్యం కుప్పల వద్ద కాపలా ఉండడానికి భయపడుతున్నామని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని, త్వరగా తూకాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

20 రోజులుగా కాపలా ఉంటున్నాం



వరి పంట నూర్పిళ్లు చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించాం. 20 రోజులవుతోంది. రాత్రింబవళ్లు ధాన్యం వద్ద కాపలాగా ఉంటున్నాం. సౌకర్యాలు లేక రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు తొందరగా తూకం వేయాలి. – చాకలి నారాయణ, భవానీపేట

తూకాలు ప్రారంభించాలి



ధాన్యాన్ని పదిరోజులకింద కొనుగోలు కేంద్రానికి తరలించాను. కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు లేవు. తాగునీరు లేదు, నీడ లేదు. చెట్ల కింద ఉంటున్నాం. రాత్రివేళ పాములు, తేళ్లు వస్తున్నాయి. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి. – చల్ల బాలమల్లయ్య, అయ్యపల్లి

వారం రోజులుగా పడిగాపులు



కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకు వచ్చి వారం రోజులవుతోంది. ఇప్పటికి కాంటాలు ప్రారంభం కాలేదు. కుప్పల వద్దే కాపలా ఉండాల్సి వస్తోంది. వర్షాలు పడేటట్లు ఉన్నందున తూకాలు ప్రారంభించి, వెంటవెంటనే వడ్లను రైస్‌మిల్లులకు తరలించాలి. – కొర్ర రమేశ్, రైతు, ఒడ్డేపల్లి

రైస్ మిల్లులకు అలాట్‌మెంట్ ఇవ్వలేదు

జిల్లాలో బాన్సువాడ డివిజన్‌లో పంట నూర్పిళ్లు ముందుగా ప్రారంభం అవుతాయి. అక్కడ రైస్ మిల్లులకు అలాట్‌మెంట్ ఇచ్చాం. తూకం వేసి ధాన్యం రైస్ మిల్లులకు తరలిస్తున్నాం. కొన్నిచోట్ల హమాలీల కొరత ఉన్న చోట రైస్ మిల్లులకు అలాట్‌మెంట్ ఇవ్వలేదు. అలాట్‌మెంట్ ఇవ్వగానే తూకాలు ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. – రామ్మోహన్, డీసీవో


తప్పుడు పత్రాలతో కొలువులు!

దృష్టిలోపం కోటాలో ఉద్యోగాలు

- లోపం 40 శాతంలోపే ఉన్నట్లు నిర్ధారణ
- ఐదుగురిని అనర్హులుగా గుర్తిస్తూ విద్యాశాఖ నోటీసులు
- కోర్టుకు వెళ్లిన సదరు ఉపాధ్యాయులు..
- కౌంటర్ దాఖలు చేసిన విద్యాశాఖ అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సినవారే.. ఉద్యోగం కోసం తప్పుదారిన వెళ్లారు. దివ్యాంగుల కోటా కోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. అయితే ఈ విషయం నిర్ధారణ కావడంతో ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదంటూ జిల్లా విద్యాశాఖ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై సదరు టీచర్లు కోర్టుకు వెళ్లగా.. విద్యాశాఖ కౌంటర్ దాఖలు చేసింది.

డీఎస్సీ–2024లో విజువల్ హ్యాండీకాప్డ్ (దృష్టిలోపం) కోటాలో వివిధ సబ్జెక్టుల్లో 17 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. అయితే 11 మంది మాత్రమే ఎంపికయ్యారు. అందరూ సదరం సర్టిఫికెట్లను చూపి రిజర్వేషన్ కోటాలో ఉద్యోగాలు పొందారు. తర్వాత రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు 11 మందిని సరోజినిదేవీ కంటి ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం పంపించారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఆరుగురికి 40 శాతానికిపైగా దృష్టి లోపం ఉందని, మిగతా ఐదుగురు 40 శాతంలోపు దృష్టి దోషంతో ఉన్నారని నిర్ధారించారు. నిబంధనల ప్రకారం 40 శాతానికిపైగా దృష్టి లోపం ఉంటేనే రిజర్వేషన్‌కు అర్హులు. సదరం సర్టిఫికెట్లలో దృష్టిలోపం ఎక్కువగా ఉండగా, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో తక్కువ ఉన్నట్లు తేలింది. ఐదుగురిలో ఇద్దరికి పది శాతం, ముగ్గురికి 30 శాతం మాత్రమే ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారికి విజువల్ హ్యాండీ కాప్డ్ (దృష్టిలోపం) రిజర్వేషన్ కోటా వర్తించదని విద్యాశాఖ అధికారులు తేల్చారు.



ఆ ఐదుగురికి...

నిబంధనల ప్రకారం రిజర్వేషన్ పొందడానికి అర్హత లేనందున ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.రాజు ఫిబ్రవరి 28న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులకు వారు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేదంటూ వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని నిర్ణయించారు. అయితే తాము సదరం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలకు ఎంపికయ్యామని, తమదెలాంటి తప్పిదం లేదని ఆ ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. దీంతో విద్యా శాఖ అధికారులకు కోర్టు నుంచి నోటీసులు వచ్చాయి. దీనిపై విద్యాశాఖ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. సరోజినీ దేవి ఆస్పత్రి వైద్యులు చేసిన పరీక్షల రిపోర్టులను న్యాయస్థానం ముందుంచారు. దీనిపై విచారణ జరగాల్సి ఉంది.

చర్యలు తీసుకునే అధికారం ఉంది

ఉద్యోగంలో చేరిన సమయంలో తప్పుడు పత్రాలు సమర్పిస్తే చర్యలు తీసుకునే అధికారం ఉంది. 40శాతం కన్నా ఎక్కువ దృష్టి లోపం ఉన్నట్లు వారు సదరం సర్టిఫికెట్లు ఇచ్చారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా దృష్టిలోపం, చెవుడు వంటి వాటికి సంబంధించిన కోటాలో ఉద్యోగాలు పొందిన వారిని ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు జరిపించగా.. జిల్లాకు చెందిన ఐదుగురికి తక్కువ దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అందుకే వారికి నోటీసులు ఇచ్చాం. వారు కోర్టును ఆశ్రయించగా.. మేం కౌంటర్ దాఖలు చేశాం. కోర్టు ఆదేశాలు వచ్చాక చర్యలు తీసుకుంటాం. –రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి, కామారెడ్డి

గాంధీభవన్‌లో 'జహీరాబాద్'పై సమీక్ష

కామారెడ్డి టౌన్‌: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జహీరాబాద్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావుతో పాటు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలపై మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, నాయకులు యూసుఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మీనాక్షి నటరాజన్‌తో సమావేశంలో పాల్గొన్న మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ తదితరులు

'ఓపెన్' అక్రమాలకు కళ్లెం పడేనా?

- రేపటి నుంచి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు
- సమన్వయకర్తలు చెప్పిన వారికే సీఎస్, డీవో విధులు
- మూడేళ్లుగా అనుకూలమైన వారే ఇన్విజిలేటర్లు
- పైరవీలకు పెద్దపీట వేస్తున్న విద్యాశాఖాధికారులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. గతంలో చూచిరాతలు, మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన సందర్భాలున్నాయి. ఈ ఏడాది కూడా పరీక్షల్లో అక్రమాలకు కొందరు చక్రం తిప్పుతున్నారు. పరీక్షల నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించే చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు(డీవో), ఇన్విజిలేటర్లను తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు విద్యాశాఖ అధికారుల వద్ద పావులు కదుపుతున్నారు. కాగా, ప్రతి ఏడాది వేసవిలో నిర్వహించే ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా చేసేందుకు పోటీ ఎక్కువగా ఉంటోంది. వేసవిలో వచ్చే సంపాదిత సెలవుల (ఈఎల్స్) కోసం ఉపాధ్యాయులు పోటీ పడుతుంటారు. పరీక్షా కేంద్రాల్లో చూచిరాతలనూ ప్రోత్సహిస్తుంటారనే ఆరోపణలున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు నిజామాబాద్ జిల్లాలో 17, కామారెడ్డి జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్ల జాబితా పరీక్షలు ప్రారంభమయ్యేంత వరకు గోప్యంగా ఉంచుతున్నారు. ఈ ఏడాది కూడా జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఇంకా పెట్టలేదు. గత మూడేళ్లుగా జిల్లాలో ప్రధానంగా ఆర్మూర్ డివిజన్‌లోని పరీక్షా కేంద్రాల్లో పాత వారినే సీఎస్, డీవోలుగా నియమిస్తున్నారు. ఈ సెంటర్లకు సంబంధించి వేల్పూర్, జక్రాన్‌పల్లి, ఆర్మూర్, భీంగల్‌కు చెందిన దాదాపు 10 మంది ఉపాధ్యాయులు ఐదేళ్లుగా డ్యూటీలు చేస్తున్నారు. ఇందులో ఒక ప్రధాన ఉపాధ్యాయ సంఘానికి చెందిన డివిజన్ నాయకుడు చక్రం తిప్పుతున్నాడనేది బహిరంగ రహస్యంగా చెప్పవచ్చు. అలాగే ప్రతి కేంద్రంలో అవసరానికి మించి ఎక్కువ మందికి డ్యూటీలు వేయడంతో వారిలో చాలా మంది కేంద్రాలకు రాకుండానే డ్యూటీ సర్టిఫికెట్లు పొందుతూ సంపాదిత సెలవులు పొందుతున్నారు. గత మూడేళ్లుగా పై నాలుగు మండలాల ఎంఈవోలు తీసిన ఉత్తర్వు కాపీలను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తే అవకతవకలు బయటపడుతాయని ఉపాధ్యాయవర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని బాలికల పాఠశాలలో గతేడాది 13 మంది ఇన్విజిలేటర్లకు డ్యూటీ వేయగా అందులో 10 మందికి గత మూడేళ్లుగా సెంటర్లు మారుస్తూ డ్యూటీ వేస్తున్నారు. జిల్లాలో చాలా కేంద్రాల్లో పాత వారికే డ్యూటీలు వేస్తూ చూచిరాతలు నడిపిస్తున్నట్లు సమాచారం.

ఒక్కొక్కరి నుంచి రూ.600 వసూలు

నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్షా కేంద్రాలలో సింహభాగం కేంద్రాలు చూచిరాతలకు అడ్డాగా మారాయి. గతేడాది ఆర్మూర్ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రంలో ఒక్కో అభ్యర్థి నుంచి రూ.600 వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. గత సంవత్సర తప్పిదాలు పునరావృతం కాకుండా ఇటీవల అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మరి ఈసారైనా చూచిరాతలకు ఫుల్‌స్టాప్ పడుతుందా? అనేది వేచి చూడాల్సిందే.



ఏర్పాట్లు పూర్తి చేశాం..

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశాం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో 4,600 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. డీఈవో ఆధ్వర్యంలో సీఎస్‌లు, డీవోలకు అవగాహన కల్పించాం. శనివారం ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తారు. ప్రశ్నపత్రాలు సంబంధిత పోలీస్ స్టేషన్లకు చేర్చాం. ఈసారి ఈఎల్స్ ఇవ్వడం లేదు. కొందరు ఇన్విజిలేటర్లను కూడా మార్చాం. చూచిరాతలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. – రవీందర్, జిల్లా కోఆర్డినేటర్, ఉమ్మడి నిజామాబాద్

అకాల వర్షంతో ఆగమాగం

మాచారెడ్డి/కామారెడ్డి రూరల్/రాజంపేట/బీబీపేట: జిల్లాలోని పలు ప్రాంతాలలో శుక్రవారం బలమైన గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ఇళ్లు, షెడ్లకు సంబంధించిన రేకులు కొట్టుకుపోయాయి. మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్, అక్కాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మామిడి కాయలు రాలిపోయాయి. పాల్వంచలో కామారెడ్డి –సిరిసిల్ల రహదారిపై చెట్లు విరిగి రోడ్డుకు అడ్డం పడిపోయాయి. కామారెడ్డి మండలంలోని గూడెం గ్రామంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. గ్రామానికి చెందిన తెడ్డు బాలరాజు, చిట్టపురం బాలరాజు, కిష్టయ్య, స్వామి, గుడుగుల బాలరాజులకు చెందిన రేకుల ఇండ్లు, చిందాల రాజిరెడ్డి కోళ్ల ఫారం రేకులు కొట్టుకుపోయాయి. రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డిపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జీత్యానాయక్ ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. ఇంట్లో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బీబీపేట మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో బలమైన గాలులు వీచాయి. మల్కాపూర్ రోడ్‌లోని రైస్ మిల్ రేకులు కూలిపోయాయి. శివారు రాంరెడ్డిపల్లిలో గ్రామ పంచాయతీ కార్మికుడి ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. బీబీపేటలో ఏడు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బీబీపేటలో రెండు ఇళ్ల పై రేకులు లేచిపోయాయి. ఎంపీడీవో కార్యాలయం ముందున్న నర్సరీకి ఏర్పాటుచేసిన నెట్ మొక్కలపై పడిపోయింది.




బీబీపేటలో కూలిన విద్యుత్ స్తంభం



కామారెడ్డి మండలం గూడెంలో..



గూడెంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు



పాల్వంచలో విరిగిపడ్డ చెట్టు



చుక్కాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



ఎల్లారెడ్డిపల్లి తండాలో కొట్టుకుపోయిన రేకులు

ధాన్యం తూకంలో మోసం

- రైతుల ఆందోళన
- సరి చేస్తామన్న నిర్వాహకులు

కామారెడ్డి రూరల్ : శాబ్దిపూర్ కొనుగోలు కేంద్రంలో బస్తాకు రెండు కిలోలు ఎక్కువగా తూకం వేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం ధాన్యం బస్తా బరువు 40.600 కిలోలు ఉండాల్సి ఉండగా తరుగు కోసం 42.500 కిలోలు తూకం వేయడానికి ఒప్పుకున్నామన్నారు. అయినా సెంటర్ నిర్వాహకులు అదనంగా రెండు కిలోలు జోకుతున్నారని ఆరోపించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పీఏసీఎస్ సెక్రెటరీ కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చి కాంటాను సరి చేస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.



శాబ్దిపూర్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో షటర్ వివాదం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ముందు శుక్రవారం ఓ షటర్ వ్యవహారంలో వివాదం చోటుచేసుకుంది. 20 ఏళ్ల క్రితం నుంచి బస్టాండ్ ముందు షటర్ వేసుకుని టీ వ్యాపారం చేసుకుంటున్నామని తమదే ఆ షటర్ అని ఓ మహిళ తెలిపింది. ఆ షటర్‌ను ఆర్టీసీ యూనియన్‌కు కేటాయించినట్లు నాయకులు తెలిపారు. ఆ షటర్ తమదేనంటూ ఇరు వర్గాలు వాగ్వాదం చేసుకున్నాయి. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ఆర్టీసీ అధికారులు విచారణ జరుపుతారని పోలీసులు వారికి నచ్చజెప్పి గొడవను సద్దుమనిగించారు.

రోడ్డుపైనే ధాన్యం ఆరబోత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, పర్మళ్ల, శెట్పల్లి, భవానిపేట, ఒంటర్‌పల్లితో పాటు పలు గ్రామాలకు వెళ్లే రోడ్డుపైనే ధాన్యం ఆరబోశారు. రైతులకు ధాన్యం ఆరబెట్టడానికి కల్లాలు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

దగ్ధమైన ఈత వనాల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలో ఈదుల్ల వాగు వద్ద ఇటీవల దగ్ధమైన ఈత వనాన్ని శుక్రవారం పరిశీలించినట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపారు. సుమారు 300 ఈత చెట్లు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయా, ఎవరైనా దహనం చేశారా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఎక్సైజ్ ఎస్సై జగన్మోహన్, సిబ్బంది ఉన్నారు.

పెరిగిన వరికోత యంత్రాల కిరాయి

- తడిసి మోపెడవుతున్న రవాణా చార్జీలు
- ఆర్థికంగా కుదేలవుతున్న రైతులు



బాన్సువాడలో వరి కోస్తున్న యంత్రం

బాన్సువాడ : బాన్సువాడ ప్రాంతంలో యాసంగి వరికోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వరి కోత యంత్రాల కిరాయిలు భారీగా పెరిగాయి. గత వర్షకాలం వరి కోతలు చేసే టూ వీలర్ హార్వేస్టర్ యంత్రానికి గంటకు రూ.2200 ఉండగా ఇప్పుడు రూ.2400 నుంచి రూ.2500 వరకు పెంచారు. ఫోర్ వీలర్ యంత్రానికి గతంలో గంటకు రూ.2500 చొప్పున తీసుకోగా ఇప్పుడు ఆ ధరను రూ.2600 నుంచి రూ.2800 వరకు పెంచారు. తడి నేలలు నీటితో ఉన్న కమతాల్లో వరిని కోసేందుకు ట్రాక్ యంత్రానికి (చైన్) గత వర్షకాలంలో గంటకు రూ.2800 ఉండగా ఇప్పుడు రూ.2900 చేశారు. పశుగ్రాసం సేకరణలో భాగంగా ఎండుగడ్డిని కట్టలు కట్టేందుకు వినియోగించే బేలర్ యంత్రం ధరను యాజమానులు పెంచారు. గతంలో కట్టకు రూ.20 తీసుకోగా ప్రస్తుతం రూ.30 నుంచి రూ.35 కి పెంచారు. ధాన్యాన్ని బస్తాల్లోకి, ట్రాక్టర్ల మీదకు చేర్చేందుకు కూలీ రెట్టింపు అయింది. గతంలో బస్తాకు రూ. 20 ఉండగా ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ట్రాక్టర్ల యాజమానులు సైతం రవాణా చార్జీలు భారీగా పెంచారు. గతంలో ఒక్కో లోడ్ రూ.500 తీసుకుంటే ప్రస్తుతం రూ.700 పెంచారు. గడ్డి కట్టలను సైతం ఇంటికి చేర్చేందుకు ఒక్కో కట్టకు రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు .ధాన్యాన్ని కల్లాలు, మిల్లులు, ఇళ్లకు తరలించేందుకు రవాణా చార్జీలు సైతం తడిసి మోపెడవుతున్నాయి. డీజిల్, పెట్రోల్ ధరలను సాకుగా చూపుతూ యంత్రాలు, ట్రాక్టర్ల యజమానులు ధరను అమాంతం పెంచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తగ్గే అవకాశం



ఈ యాసంగిలో 5 ఎకరాల్లో వరి సాగు చేశా. పైరుకు రెండు సార్లు స్ప్రే చేశా. గింజ పాలుపోసుకోక తాలుగా మారింది. తాలు వల్ల పొలమంతా తెల్లగా కనిపిస్తోంది. గతంలో 25 క్వింటాళ్ల దిగుబడి సాధించా. ఇప్పుడు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. వరి కోతలకు యంత్రాల ధరలను పెంచితే మాకు మిగిలేది అంతంత మాత్రమే.

– నారాయణ, రైతు, బాన్సువాడ

ఏం మిగిలేలా లేదు



నాకున్న పది కరాల్లో వరి పంట వేశాను. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పంట బాగానే వచ్చింది. మూడు సార్లు స్ప్రే చేశా. ఆకాల వర్షానికి పంట పూర్తిగా నేలకొరిగింది. ట్రాక్టర్లు, యంత్రాలకు రేట్లు పెంచారు. ఖర్చులు పోను ఏమి మిగిలేలా లేదు.

– దోసాయి వెంకట్, రైతు, అన్నారం

అక్రమ నియామకాలపై కలెక్టర్ స్పందించాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: మెడికల్ కళాశాలలో ఇటీవల జరిగిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలలో అక్రమాలు జరిగాయని తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా మెరిట్ ఆధారంగా తీసుకోకుండా కామారెడ్డి మ్యాన్ పవర్ ఏజెన్సీ అక్రమ నియామకాలకు పాల్పడినట్లు తెలిపారు. రూ. కోటికిపైగా కుంభకోణం జరిగిందని ఆరోపించారు. తక్షణమే కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ నియమకాలు రద్దు చేయకపోతే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, బీసీ విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాగరాజు, బీపీయం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ శివ, నాయకులు అజయ్, రాహుల్, మనోజ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో చలివేంద్రం ప్రారంభం



దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముత్తగారి సాయాగౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారులు శిరిష్‌గౌడ్ గ్రామంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాహుల్‌గౌడ్, సురేష్‌గౌడ్, అనిల్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బైరవప్రసాద్, అజీమ్, ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, హరిష్‌రెడ్డి, మధు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కి గ్రామంలో గల ఎస్సీ కాలనీలో నీరు వృథాగా పోతుంది. సింగిల్ ఫేజ్ మోటారు ఆన్ ఉంచడంతో నిరంతరం నీరు వృథా అవుతూనే ఉంటుంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని కుళాయిలకు ఆన్ ఆఫ్ ట్యాప్ లు ఏర్పాటు చేస్తే వృథాగా పోతున్న నీటిని అరికట్టవచ్చు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ : బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. బాన్సువాడ డివిజన్‌లో అతి పెద్ద జాతరగా భేతాళస్వామి జాతరకు ఆదరణ ఉంది. ఏటా ఉత్సవాల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. శుక్రవారం నిర్వహించిన జాతరలో పాల్గొని, పోటీలను తిలకించడానికి స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలనుంచే కాకుండా మహారాష్ట్ర- కర్ణాటక సరిహద్దు గ్రామాల నుంచి జనం కూడా జనం తండోపతండాలుగా వచ్చారు. మల్లయోధులు కూడా అంతే ఉత్సాహంతో తొడ కొట్టి తలపడ్డారు. కొబ్బరి కాయ కుస్తీతో మొదలైన పోటీలు రూ. 5,001 కుస్తీ వరకు సాగాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పోటీలను తిలకించారు. విజేతలకు బహుమతులు అందించారు.



బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఉత్తునూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్ గ్రామాభివృద్ధి నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా గుడ్ల శ్రీకాంత్ రావు, వైస్ చైర్మన్‌గా ఎం.చిన్న వీరన్న, కోశాధికారిగా వాగుమారి రమేశ్, ప్రధానకార్యదర్శిగా ఒడ్డె కిషన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రావు మాట్లాడుతూ...గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్మళ్ల గ్రామ అంబేడ్కర్ కమిటీ..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన అంబేడ్కర్ గ్రామ యువజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడుగా గంట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు రాజుగారి సాయిలు, ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి మన్నె గంగారాం, కార్యవర్గ సభ్యులు గంట బాబు, పర్వయ్య, పద్మరావు, బాలపోచయ్య, ఇస్తారి, బాలు, రాజులను ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద మురుగు



పెద్దమల్లారెడ్డి అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలిచిన మురుగు నీరు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని నాలుగో వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద మురుగు నీరు నిలిచి ఉండటంలో చిన్నారులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంక్ ఉంది. ఆ ట్యాంక్ ఓవర్‌ఫ్లో అయినప్పుడు బయటకు వచ్చే నీరు అక్కడ నిలిచి బురదమయంగా మారుతోంది. పందులు అక్కడ నివాసం ఏర్పరుచుకున్నాయి. ఈవిషయమై పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యువతిని వేధించిన యువకుడి అరెస్ట్



బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని సోషల్ మీడియాలో వేధించిన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందుకుర్తి గ్రామానికి చెందిన అలీమ్ బేగ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు బోథ్ ఎస్సై ఎల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. యువతిని గత కొంతకాలంగా సోషల్ మీడియాలో అలీమ్‌బేగ్ వేధిస్తున్నాడని తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు అలీమ్‌బేగ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా అలీమ్‌బేగ్‌పై రౌడీషీట్ ఉన్నట్లు పేర్కొన్నారు. రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నాయన్నారు. డిచ్‌పెల్లి పోలీస్‌స్టేషన్‌లో 2023లో అలీమ్‌బేగ్ వద్ద నుంచి 17 బైక్‌లు రికవరీ చేసినట్లు తెలిపారు.

నాటు తుపాకులతో పాటు ఇద్దరి అరెస్టు

తాడ్వాయి: మండలంలోని కన్‌కల్ గ్రామంలో నాటు తుపాకులతో తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన తిల్ పీత్య మహేందర్‌సింగ్, తిల్ పీత్య ఇందర్‌సింగ్ మండలంలోని కన్‌కల్‌లో కొంతకాలంగా నివసిస్తూ లేబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు శుక్రవారం తాడ్వాయిలోని కల్లు డిపో వద్ద నాటుతుపాకులతో తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి చేరుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎల్లారెడ్డి: పట్టణంలోని గ్యాస్ గోదాంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అగ్నిమాపక అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాంలో అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు వినోద్, నరేందర్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



ఖలీల్‌వాడి: గుండెపోటుతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీకి చెందిన బాచుపల్లి భానుచందర్(36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడో టౌన్ పరిధిలోని రైతు బజార్ వద్ద ఉన్న వైన్స్ దుకాణం ఎదురుగా ఆటోను నిలిపి పాటలు వింటున్నాడు. ఆటోలో మూడు గంటల పాటు అతను కదలకుండా ఉండడాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న మరో లారీ



భిక్కనూరు: మండల సమీపంలోని టోల్ ప్లాజా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. టోల్ ప్లాజా వద్ద నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో వెనుక లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాల సమీపంలో ఉన్న మంజీరా నది నుంచి గురువారం రాత్రి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. గోలిలింగాలకు చెందిన కోడె గంగారాం, తొంట సిద్ధిరాములు, పిట్ల సత్యనారాయణ, పుట్ల సంతోష్, కాంచనపల్లి లింగాగౌడ్, పుట్ల కిష్టయ్య ఎలాంటి అనుమతులు లేకుండా మంజీరా నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు యత్నిస్తుండగా సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఒకరిపై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద పడుకొని ఉన్న కుభీర్ మండలానికి చెందిన కుంచెపు బాబుపై గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. రైల్వే టికెట్ కౌంటర్ వద్ద బాబుతో అనవసరంగా గొడవ పడి మెడపై బ్లేడ్‌తో దాడి చేశాడన్నారు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. నిందుతుడి పరారీలో ఉన్నాడని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

తాడ్వాయి: తాడ్వాయి పోలీసు పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తన ఇంటి ఎదుట ఉన్న మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



పెద్దకొడప్‌గల్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన పెద్దకొడప్‌గల్ మండలం రతన్‌సింగ్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వెంకట్ అనే వ్యక్తి కొన్ని నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. పలుమార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లిన వెంకట్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కామారెడ్డి జిల్లాలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బుచ్చయ్య (ఫైల్)

పిట్లం: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన పిట్లం మండలం సిద్ధాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రాజు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన కె బుచ్చయ్య చారి(42) పిట్లం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని పిట్లం నుంచి బాన్సువాడకు బైక్‌పై వెళ్తుండగా సిద్ధాపూర్ శివారులోని చెరువు కట్ట ప్రాంతంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

భిక్కనూరు: లారీని వెనుక నుంచి ఓ బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం కల్వరాలకు చెందిన శ్రీనివాస్(42) బీబీపేటలో ఉన్న బంధువుల శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా జంగంపల్లి శివారులో రోడ్డుపై నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మరొకరు..



పెద్దకొడప్‌గల్: పనిచేస్తున్న ప్రాంతంలో వెలగని బల్బును సరిచేస్తున్న ఓ వ్యక్తికి విద్యుదాఘాతం సంభవించి మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండలం జగన్నాథ్‌పల్లి తండా శివారులో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్‌కు చెందిన గజానన్(25) తండా శివారులోని ఇటుక బట్టీలో ఐదు నెలలుగా కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం వేకువ జామున పనిచేస్తున్న ప్రదేశంలో వెలగని బల్బును సరిచేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి కింద పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు బాన్సువాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి వస్తున్న గూడ్స్ రైలు డిచ్‌పల్లి పరిధిలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయస్సు 40 ఏళ్ల వరకు ఉంటాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఫొటో ఆధారంగా ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

జీవితంపై విరక్తితో మరొకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివోళ్ల చిన్నగంగయ్య(55) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం కుటుంబ సభ్యులను వేధించేవాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతను కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. శుక్రవారం ఉదయం తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

200 సైలెన్సర్ల ధ్వంసం



ఖలీల్‌వాడి: వాహన సైలెన్సర్లు మార్చి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్న యువకులపై నగర పోలీసులు కొరడా ఝులిపించారు. వాహనాల తయారీ కంపెనీ ఇచ్చిన సైలెన్సర్ కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకుని కొందరు నగరంలో తిరుగుతున్నారు. ఆయా వాహనాలు రోడ్లపై వెళ్తుంటే భారీ శబ్దం వెలువడుతుంది. దీంతో గుండెజబ్బులు ఉన్నవారు, చిన్నారులు, వృద్ధులు ఆందోళనకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో నగర పోలీసులు ఇటీవల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 200 వాహనాలకు ఉన్న మాడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటినీ శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాహనదారులకు జరిమానాలు విధించి వాటిని రోడ్డు రోలర్‌తో తొక్కించినట్లు ఏసీపీ తెలిపారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. మైనర్లకు తల్లి దండ్రులు వాహనాలను ఇవ్వొద్దని అన్నారు. శబ్ద కాలుష్యం ఏర్పడితే జరిమానా, జైలు శిక్ష విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ప్రసాద్, శేఖర్, ఎస్సై సుమన్, రహిమాతుల్లా సిబ్బంది ఉన్నారు.

ఆలయంలో చోరీ

భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరనగర్‌లో ఉన్న పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం వేకువజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళాలను పగుల గొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెలు, ముక్కుపుడకను దొంగిలించారు. ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లి కొద్దిదూరంలో ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును అపహరించుకెళ్లారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు ఎత్తుకెళ్లిన అమ్మవారి ఆభరణాల విలువ సుమారు రూ. రెండు లక్షల వరకు ఉంటుందని భక్తులు తెలిపారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్: మండల కేంద్రానికి చెందిన బంజ సిద్ధవ్వ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డట్లు ఎస్సై రంజిత్ శుక్రవారం తెలిపారు. ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లగా దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న రూ. పది వేల నగదు, కొద్దిపాటి వెండి, బంగారం చోరీకి గురైందని బాధుతురాలి తెలిపింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో సీఐ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో..

ఖలీల్‌వాడి: నగరంలోని అక్బర్‌బాగ్ కాలనీలో గురువారం రాత్రి తాళం ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన రెహమాన్ ఇంట్లో దుండుగుల చోరీకి పాల్పడ్డారని అన్నారు. బీరువాలో ఉన్న సుమారు 13 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి, కొంత నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.